క్లుప్తంగా

బీఆర్ఎస్ ఇంటింటా ప్రచారం



దబ్బా గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

చింతలమానెపల్లి: మండలంలోని దబ్బా పంచాయతీలో శనివారం బీఆర్ఎస్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు గెలిపించాలని కోరుతూ ప్రచారం చేపట్టారు. నాయకులు ఉమామహేష్, గోమాసె లాంచు, దుర్గం విజయ్, లెండుగురె సావిత్రీ, రాజారాం, నికోడె బాపురావు, తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: మండలంలోని తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు గ్రామ పంచాయతీలైన పరంధోళి, అంతాపూర్‌లోని వివిధ గ్రామాల్లో శనివారం బీఆర్ఎస్ ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించాలని కోరారు. ఎంపీపీ పెందోర్ మోతిరాం, జెడ్పీటీసీ దుర్పతబాయి, వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం, నాయకులు భీంరావు, యూనూస్, రూప్‌లాల్ తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ



ఎల్లూర్‌లో కొనుగోలు కేంద్రంలో ధాన్యం పరిశీలిస్తున్న అధికారులు

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్లూర్, కొండపల్లి, గొంట్లపేట్ గ్రామాల్లో పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా సహకార ఆడిట్ అధికారి మహమూద్ అలీ శనివారం తనిఖీ చేశారు. కేంద్రాల్లో రైతులు తీసుకుని వచ్చిన ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. కేంద్రాల్లో రైతులకు గన్నీ సంచులు, టార్పాలిన్ కవర్లు, తాగునీరు, ఓఆర్ఎస్ అందుబాటులో ఉంచాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం వెంటనే తూకం వేసి మిల్లులకు తరలించాలని సూచించారు. కేంద్రాల్లో నిర్వాహకులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం రైతులకు అందిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. డివిజనల్ ఆడిటర్ శ్యాముల్, పీఏసీఎస్ అధికారులు వెంకటేశ్వర్ గౌడ్, సత్యనారాయణగౌడ్, ఏఈవో శ్రీవిద్య ఉన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు



బిఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ విఠల్

చింతలమానెపల్లి/కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన నాయకులు శనివారం బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్సీ దండె విఠల్ వారికి పార్టీ కండువా కప్పారు. కాగజ్‌నగర్ మండలంలోని వంజీరి, ముత్యంపేట్, బోరెగూడ గ్రామాలకు చెందిన ఆయా పార్టీలకు చెందిన పలువురు బీఆర్ఎస్‌లోకి చేరుతున్నట్లు ప్రకటించారు. పార్టీలో చేరిన వారిలో మాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదె నాందేవ్, సంఘం జిల్లా కార్యదర్శి గౌత్రె గోపాల్, తదితరులు ఉన్నారు. ఎమ్మెల్సీ విఠల్ మాట్లాడుతూ అదిలాబాద్ పార్లమెంట్ స్థానాన్ని బీఆర్ఎస్ కైవసం చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

బీజేపీలో చేరిన మాజీ సర్పంచ్



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

చింతలమానెపల్లి/కాగజ్‌నగర్‌రూరల్: దహెగాం మండలంలోని ఇట్యాల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చాపిడె వెంకటి శనివారం బీజేపీలో చేరారు. ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు నివాసంలో ఆయనకు ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చాపిడె వెంకటి బీఎస్పీ పార్టీలో ఉండగా తన అనుచరులతో కలిసి బీజేపీలో చేరుతున్నట్లు తెలిపారు.

నగేశ్‌ను గెలిపించాలి



ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ నాగేశ్వర్‌రావు

ఆసిఫాబాద్‌రూరల్: బీజేపీ పార్టీకి ఓటు వేసి అభ్యర్థి నగేశ్‌ను గెలిపించాలని జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు కోరారు. మండలంలో మండలంలోని వావుదాం, మోవాడ, కోసార, మాలన్ గొంది గ్రామాల్లో శనివారం ప్రచారం నిర్వహించారు. నాయకుడు విజయ్ పాల్గొన్నారు.

ఆహ్లాదం కరువు..

- చిల్డ్రన్ పార్కులో నిర్వహణ లోపం
- పనిచేయని ఫౌంటేన్, విరిగిన ఉయ్యాల



పనిచేయని ఫౌంటేన్



పార్క్‌లోని విరిగిన ఉయ్యాల



ఆసిఫాబాద్ చిల్డ్రన్ పార్క్

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ జిల్లా ఆవిర్భావం తర్వాత జిల్లా కేంద్రంలోని ప్రజలకు కనీసం ఆహ్లాదం లేదని గుర్తించి అప్పటి అదనపు కలెక్టర్ వరుణ్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో పిల్లలు ఆడుకునేలా పెద్దలకు ఆహ్లాదాన్ని కలిగించేలా రూ.2.5 కోట్ల వ్యయంతో చిల్డ్రన్ పార్కు ఏర్పాటు చేశారు. అయితే అప్పటి నుంచి జీపీ అధికారులు పార్కు నిర్వహణ చూస్తున్నారు. తాజాగా ఆసిఫాబాద్ జీపీ నుంచి మున్సిపాలిటీగా మారడంతో అధికారుల మార్పు ఇతరాత్ర పనుల అప్పగింత జరుగుతుంది. ఈనేపథ్యంలో పార్కు నిర్వహణపై అధికారులు దృష్టిసారించకపోవడంతో ఆహ్లాదం రాబోయే రోజుల్లో అందేలా కనిపించడం లేదు.

కరువైన ఆహ్లాదం

పార్కు ఏర్పాటైన తర్వాత ప్రారంభంలో క్యాంటీన్ ఏర్పాటుతోపాటు బొంగులతో వెయిటింగ్ రూం మాదిరిగా ఏర్పాటు చేశారు. దీనికి లైటింగ్‌ను అమర్చారు. రాత్రి సమయంలో పార్క్ ఎంతో సుందరంగా కనిపించేది. అయితే గత ఐదు నెలలుగా పార్కు నిర్వహణ లోపంతో అస్తవ్యస్తంగా తయారైంది. క్యాంటీన్ కనిపించడం లేదు. దాంతోపాటు పార్కులో మొక్కల నిర్వహణ కూడా కరువై ఎండిపోతున్నాయి. నిర్వహణ లోపం స్పష్టంగా కనిపిస్తుంది. ముఖ్యంగా వేసవి కాలంలో పార్కుకు వచ్చేవారికి తాగునీరు లేకపోవడంతో ఇబ్బంది పడాల్సి వస్తుంది. సరదాగా ఏమైనా తినుబండారాలు కొనుగోలు చేస్తామంటే క్యాంటీన్ సౌకర్యం కూడా కరువైందని ప్రజలు వాపోతున్నారు.

పనిచేయని ఫౌంటేన్, విరిగిన ఉయ్యాల..

పార్కు మధ్యలో లైటింగ్‌తో కూడిన ఫౌంటేన్ ఏర్పాటు చేశారు. ఇది ప్రతిరోజూ సాయంత్రం పార్కుకు వచ్చే వారికి ఎంతో అందంగా కనిపించేది. ఫొటో ప్రియులు పెద్ద మొత్తంలో ఫొటోలు దిగి సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేసేవారు. గత కొంతకాలంగా ఫౌంటేన్ పని చేయకపోవడంతో సాయంత్రం పూట పార్కు అందాలు కనుమరుగయ్యాయి. అలాగే పిల్లలు ఊగడానికి రెండు ఉయ్యాలలు ఏర్పాటు చేయగా వాటిలో ఒకటి తెగిపోయి ఐదునెలలు గడుస్తున్నా అవి మరమ్మతుకు నోచుకోవడం లేదు.

మున్సిపాలిటీగా మారడమే శాపమా?

గతంలో గ్రామ పంచాయతీగా ఉన్న ఆసిఫాబాద్‌ను ప్రభుత్వం మున్సిపాలిటీగా మారుస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంలో జీపీ నుంచి మున్సిపాలిటీకి రికార్డులు బదిలీ చేయడంతోపాటు నూతన ప్రక్రియ ఇంకా నేటికి పూర్తి కాలేదు. దీంతో మున్సిపాలిటీ ఆస్తుల నిర్వహణపై అధికారులు దృష్టి సారించడం లేదు.

సౌకర్యాలు కల్పించాలి



చిల్డ్రన్స్ పార్క్‌లోఅన్ని సౌకర్యాలు కల్పించాలి. పిల్లల కోసం ఆట వస్తువులను అందుబాటులో ఉంచాలి. చెడిపోయిన పరికరాలకు ఎప్పటికప్పుడు మరమ్మతు చేపట్టాలి. వేసవిలో చల్లటి తాగునీటిని అందుబాటులో ఉంచాలి. క్యాంటీన్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి.– గొడిసెల కార్తీక్, ఆసిఫాబాద్

అధికారులు పర్యవేక్షించాలి



చిల్డ్రన్స్ పార్కు నిర్వహణ లోపం స్పష్టంగా కనిపిస్తుంది. సంబంధిత అధికారుల పర్యవేక్షణ కరువైంది. పార్కుకు మరిన్ని నిధులు కేటాయించి మరింత అభివృద్ధి చేయాలి. పార్కులో సెక్యూరిటీని పెంచాలి.

– ఆవిడపు ప్రణయ్, టీఆర్‌నగర్

త్వరలో మరమ్మతు చేయిస్తాం

మున్సిపాలిటీగా ఆసిఫాబాద్ ఏర్పడిన తర్వాత ఇంకా రికార్డుల బదిలీ కొనసాగుతుంది. పార్కు నిర్వహణ మున్సిపాలిటీ పరిధిలో పక్కాగా చేపడుతాం. ప్రస్తుతం చెడిపోయిన వాటికి మరమ్మతు చేయడంతోపాటు మరిన్ని నూతన వస్తువులను అమర్చడానికి ప్రయత్నాలు చేస్తాం.

– భుజంగరావ్, మున్సిపల్ కమిషనర్

వేసవి దుక్కులతో.. దిగుబడి



కెరమెరిలో దుక్కులు దున్ని సాగుకు సిద్ధం చేసిన చేను

- కలుపు బెడద నుంచి రక్షణ
- చిరుజల్లులతో ఎంతో లాభం
- చీడపీడలు మటుమాయం

గ్రామాల్లో పొలం పనులు ప్రారంభమయ్యాయి. గతనెల వరకు తమతమ పొలాల్లో ఉన్న పత్తితో పాటు అంతర పంటను తొలగించేశారు. దీంతో ఇప్పుడే మంచి తరుణం అనుకున్న అన్నదాతలు దుక్కి దున్నడం ప్రారంభించారు. వేసవిలో దుక్కి దున్నితే నేలలో ఉన్న క్రిములు, కీటకాలు చనిపోతాయని అన్నదాతలంటున్నారు.

కెరమెరి: పంటల సాగులో వస్తున్న మార్పులను ఆధునిక పద్ధతులు ఎప్పటికప్పుడు అనుసరిస్తేనే ఆశించిన దిగుబడి, అనుకున్న ఫలితాలు సాధించవచ్చు. చాలామంది రైతులు రబీ ఫలసాయాన్ని పొందగానే అలాగే వదిలేస్తారు. మళ్లీ ఖరీఫ్‌లో సాగుకు సిద్ధమవుతారు. ఇలా చేయడం వల్ల నష్టపోయే ప్రమాదం ఉంది. కెరమెరి మండలంలోని 31 పంచాయతీలు ఉండగా, 8194 మంది రైతులు ఉన్నారు. 29,456 ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతోంది. అందులో 26,140 వేల ఎకరాల్లో పత్తి సాగు చేస్తారు. కంది, జొన్న, పెసర, మొక్కజొన్న, కూరగాయలు మొత్తం కలిపి 3,406 ఎకరాల్లో సాగుచేయనున్నారు. అయితే వేసవిలో దుక్కి దున్ని భూమి వేడి చల్లారిన తర్వాత విత్తనాలు విత్తితే ఆశించిన ప్రయోజనాలు ఉంటాయని వ్యవసాయాదారులు సూచిస్తున్నారు.

ప్రయోజనాలివి..

వేసవిలో దుక్కులు దున్నడం వల్ల కలుపు బెడద తగ్గించవచ్చు. దుక్కి సిద్ధం చేసుకోకుంటే కలుపు బాగా పెరిగి భూమిలోని పోషక పదార్థాలు గ్రహించి భూసారాన్ని తగ్గిస్తాయి. భూమి పొరల్లో దాగి ఉండే కీటకాల గుడ్లు పంటలకు చీడపీడలు ఆశించడానికి కారణమయ్యే శిలింధ్రాలు నశిస్తాయి. మే, జూన్‌లో కురిసే చిరుజల్లులు లోతుగా దుక్కులు దున్నడం వల్ల పడిన వాన భూమిలోకి నేరుగా ఇంకి నాటిన విత్తనం ఏపుగా ఎదుగుతుంది. మొదలు భూమిలో కలిసి, కుళ్లిపోయి సేంద్రియ ఎరువుగా మారి పంటలకు బలం చేకూరుస్తాయి.

వర్షాలు పడ్డాకే విత్తుకుంటాం



ప్రస్తుతం ఎండలు బాగు మండుతున్నాయి. దీంతో దుక్కిలు దునిన సాగు భూమిని విత్తనాలు నాటేందుకు సిద్ధంగా చేస్తున్నాం. పెద్ద వాన కురవందే విత్తనాలు నాటడం అంతమంచిది కాదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. వారి సూచనలు పాటిస్తున్నాం.

– షేక్ కలీమ్, రైతు సుల్తాన్‌గూడ

వేడి చల్లారకముందు వద్దు



భూమిలో వేడి చల్లారకముందు విత్తనాలు విత్తుకోవద్దు. తర్వాత విత్తితేనే మొక్కలు ఎదిగి దిగుబడులు పెరుగుతాయి. లోతుగా దుక్కి దున్నడం వల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటో ముందు తరం అన్నదాతలకు తెలుసు. రైతులు వేసవిలో దున్ని ఖరీఫ్ సీజన్‌కు తయారు కావాలి.

– ఎస్.గోపీకాంత్, ఏంఏవో, కెరమెరి

గ్యాస్ లీకై చెలరేగిన మంటలు



మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

రెబ్బెన(ఆసిఫాబాద్): వంట చేస్తున్న క్రమంలో ఒక్కసారిగా గ్యాస్ లీకై మంటలు చెలరేగగా అగ్నిమాపక సిబ్బంది సకాలంలో సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పినట్లైంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని నంబాలకు చెందిన పాగిడి బుచ్చయ్య, అతని కుమారుడు వెంకటేశ్‌తోపాటు అతని సోదరి నంబాలలోని కొమ్ముగూడెంలో నివసిస్తున్నారు. అయితే శనివారం మధ్యాహ్న సమయంలో ఇంట్లో వంట చేస్తున్న క్రమంలో ఒక్కసారిగా గ్యాస్‌లీకై మంటలు వ్యాపించాయి. దాంతో భయాందోళనకు గురై ఇంట్లో నుంచి బయటకు పరుగులు తీసి డయల్ 101కు ఫోన్ చేశారు. అయితే ఆ సమయంలో 101 నంబర్ పని చేయకపోవటంతో విషయాన్ని మాజీ సర్పంచ్ చెన్న సోమశేఖర్, జెడ్పీటీసీ వేముర్ల సంతోష్ దృష్టికి తీసుకెళ్లారు. దాంతో జెడ్పీటీసీ ఫైర్ సిబ్బందికి ఫోన్ చేసి సమాచారం అందించడంతో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలార్పివేశారు. దాంతో ప్రమాదం తప్పింది. అయితే అప్పటికే ఇంట్లో టేకు మంచం, దివాన్‌తోపాటు కూలర్లు కాలిపోయాయి. వీటి విలువ రూ.50 వేల వరకు ఉంటుందని బాధితులు తెలిపారు.



అ'పూర్వ' సమ్మేళనం

కౌటాల: మండలంలోని విజయనగరం గ్రామంలోని సెయింట్ జోసెఫ్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో 2003-04 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు శనివారం కలుసుకున్నారు. పాఠశాలలో నిర్వహించిన అపూర్వ సమ్మేళనానికి వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి గుర్తులను నెమెరువేసుకున్నారు. రోజంతా సంతోషంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.

బీజేపీ, కాంగ్రెస్‌ను నమ్మి మోసపోవద్దు



గోలేటిలో బీఆర్ఎస్ మేనిఫెస్టో పత్రాలను అందజేస్తున్న పార్టీ నాయకులు

రెబ్బెన: పార్లమెంట్ ఎన్నికలు దృష్టిలో పెట్టుకుని బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు ప్రజలకు ఇచ్చే మోసపూరిత వాగ్దానాలు నమ్మి మోసపోవద్దని మాజీ జెడ్పీటీసీ అజ్మీర బాబురావు అన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించాలని కోరుతూ శనివారం గోలేటి లోని గొండుగూడ, దుర్గాపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. నాయకులు గుంపుల విమలేష్, మల్లయ్య, అసీఫ్ అలీ, వెంకటేశ్, సుబ్బారావు, శ్రీనివాస్, రవీందర్, శంకర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉపాధికూలీ రూ.400

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉపాధి కూలీల రోజు వారి కూలీని రూ. 400 చేస్తుందని నాయకులు అన్నారు. మండలంలోని రెబ్బెన, పుంజుమేరగూడ, నక్కలగూడ, సింగల్‌గూడ గ్రామాల్లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలను శనివారం కలిసి పార్టీ పాంచ్ న్యాయ సూత్రాలను వివరించారు. జెడ్పీటీసీ సంతోష్, పార్టీ నాయకులు రమేశ్, దేవాజీ, సుదర్శన్‌గౌడ్, చిరంజీవిగౌడ్, గోగర్ల రాజేష్, గోపి, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హరిత నిర్లక్ష్యం..ప్రజాధనం వృథా

- ఏటా లక్షల మొక్కలు నాటుతున్న వైనం
- సంరక్షించడంలో అధికారుల విఫలం
- ఈ ఏడాది నర్సరీల్లో 3.5 లక్షల మొక్కల పెంపకం
- లక్ష్యం 1.5 లక్షల మొక్కలు



ఈ ఫొటోలో కనిపిస్తున్నది వాంకిడి ఖమాన ప్రధాన రహదారి. ఈ దారి గుండా హరితహారంలో భాగంగా ప్రతీ సంవత్సరం మొక్కలు నాటుతున్నారు. నాటిన మొక్కలకు సంరక్షణ చర్యలు తీసుకోకపోవడంతో కొన్ని నెలలకే అవి పశువులకు ఆహారం అవుతున్నాయి. హరితహారం కార్యక్రమం ప్రారంభమై ఈ ఏడాదితో 9 ఏళ్లు కాస్తుండగా ఈ రహదారి గుండా నాటిన మొక్కల్లో ఒక్కటి కూడా బతికి లేకపోవడం గమనార్హం.



మొక్కలు ఎండిపోవడంతో ఖాళీగా ప్రకృతివనం

వాంకిడి: పట్టణాలతోపాటు గ్రామాల్లో మొక్కలను విరివిగా నాటి వన సంపదను పెంచేందుకు 2015లో గత ప్రభుత్వం తెలంగాణకు హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ప్రతీ పంచాయతీకి నర్సరీ ఏర్పాటు చేసేలా కార్యాచరణ రూపొందించింది. మొక్కల సంరక్షణ దృష్టిలో పెట్టుకుని విడతలవారీగా పంచాయతీలకు ట్రాక్టర్లు, వాటర్ ట్యాంకర్లు పంపిణీ చేసింది. మొక్కలకు ఎరువులు తయారీ చేసేలా ప్రతీ జీపీకి చెత్తశుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేసింది. మొక్కలు నాటడంతో సరిపెట్టుకోకుండా వాటిని జాగ్రత్తగా కాపాడుకోవాలని, మొక్కల పెంపకంలో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలవాలనే సదుద్దేశంతో అధికారులకు కచ్చితమైన ఆదేశాలు జారీచేసింది. కానీ అధికారుల మొక్కవోని నిర్లక్ష్యంతో అనేక గ్రామాల్లో నాటిన మొక్కలు కొన్ని నెలలకే చనిపోతున్నాయి. సంరక్షణ చర్యలు చేపట్టాల్సిన పంచాయతీ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో ప్రతీ ఏడాది హరితహారంలో భాగంగా నాటిన లక్షల మొక్కలు, నాటేందుకు ఖర్చు అయ్యే రూ.లక్షల ప్రజాధనం వృథా అవుతుంది.

ప్రతీ ఏటా అదే చోట..

మండలంలో 28 గ్రామ పంచాయతీలు ఉండగా ప్రతీ జీపీకి ఒకటి చొప్పున నర్సరీలు ఏర్పాటు చేసుకుని మొక్కలు పెంచుతున్నారు. ఒక్కో నర్సరీలో 10 వేల నుంచి 30 వేల వరకు జనాభా దృష్టిలో పెట్టుకుని మొక్కల పెంపకం చేపడుతున్నారు. పెంచిన మొక్కలను అవసరం ఉన్నా ప్రాంతాల్లో నాటి వాటిని బలంగా ఎదిగేలా రక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. నాటిన మొక్కలకు నీరు పట్టడం, రక్షణగా కంచె ఏర్పాటు చేయడం పంచాయతీ అధికారుల బాధ్యత ఉంటుంది. నర్సరీల ఏర్పాటు నుంచి పెరిగిన మొక్కలు నాటడం వరకు కూలీలకు అయ్యే ఖర్చంతా ఉపాధి హామీ నుంచి చెల్లిస్తున్నారు. పెంచిన మొక్కలను గ్రామంలోని ఇంటింటికీ పంపిణీ చేయడంతోపాటు కమ్యూనిటీ ప్లాంటేషన్, ఎవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా రహదారులు, సంఘ భవనాలు, ఆలయాలు, కాలువ గట్లు, చెరువు గట్లు, పంట చేళ్ల వంటి ప్రదేశాల్లో మొక్కలను విరివిగా నాటాల్సి ఉంటుంది. అయితే ప్రభుత్వ ఆదేశాలనుసారం మొక్కలు నాటుతున్నారు. కాని వాటి సంరక్షణను మాత్రం మరిచిపోతున్నారు. ఎవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా గ్రామాలకు వెళ్లే రహదారుల గుండా ఏటా వేల మొక్కలను నాటి వదిలేస్తున్నారు. మొక్కలకు రక్షణ కంచెలు ఏర్పాటు చేయకపోవడంతో రహదారుల పశువులు ఆహారమవుతున్నాయి. కొన్నిచోట్ల రైతులు తమ పంట వ్యర్థాలను కాల్చే సమయంలో మొక్కలు కాలిపోతున్నాయి. రోడ్ల నిర్మాణ సమయంలో నాటిన మొక్కలు చనిపోతున్నాయి. దీంతో నాటిన ఏడాదిలోపే ఆ మొక్కలు చనిపోతుండటంతో మళ్లీ అదే ప్రాంతంలో అదే నిర్లక్ష్యంతో మొక్కలు నాటి చేతులు దులుపుకోవడం పరిపాటిగా మారింది. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతుంది.

ప్రజాధనం వృథా..

9వ విడత హరితహారంలో భాగంగా మండలంలోని జీపీల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో 3.5 లక్షల మొక్కలు పెంచుతున్నారు. అందులో కొత్త ప్రదేశాల్లో 1.5 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యంగా అధికారులు కార్యాచరణ రూపొందించారు. చనిపోయిన మొక్కలు తొలగించి మిగిలిన మొక్కలను రీప్లేస్‌మెంట్ కింద నాటాల్సి ఉంటుంది. కానీ క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే నాటిన మొక్కల సంరక్షణ నామమాత్రంగానే కనిపిస్తుంది. రికార్డుల పరంగా మొక్కల సంఖ్య ఒకలా ఉంటే బతికున్న మొక్కలు చాలా తక్కువగా దర్శనమిస్తాయి. ప్రతీఏటా హరితహారం కార్యక్రమానికి రూ.30 లక్షల నుంచి 40 లక్షల వరకు ఉపాధి హామీ నిధుల నుంచి ఖర్చు చేస్తుండగా మొక్కలను కాపాడుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారని మండల వాసుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని జీపీల్లో మాత్రమే రహదారుల గుండా మొక్కలు ప్రస్తుతం కనుమరుగవుతున్నాయి. దీంతో ప్రతీ ఏటా ఖర్చు చేస్తున్న లక్షల రూపాయల ప్రజాధనం వృథా అవుతుంది.

'కాంగ్రెస్‌తోనే అభివృద్ధి'



నిసానిలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

కెరమెరి: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఆత్రం కుసుంబ్‌రావు, యూత్ అధ్యక్షుడు దండుగుల శ్రీనివాస్ అన్నారు. మండలంలోని నిసాని, ఇందాపూర్, ఉమ్రి, అగుర్‌వాడ గ్రామాల్లో శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణకు ఓటు వేసి గెలిపించాలన్నారు. తిరుపతి, క్రిష్ణ, భగవంతరావు, జంగు, మాధవరావు, అనిల్, అరుణ్ తదితరులు ఉన్నారు.